క్లుప్తంగా

ఆరోగ్య సర్వే సకాలంలో పూర్తి చేయాలి



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే'ను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య ఆరోగ్య, ఆశా కార్యకర్తలను, వలంటీర్లను ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న పేషంట్ల గృహాలకు మధ్యాహ్న సమయంలో వెళ్లి వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీ శివశక్తి వినాయక బృందం సభ్యులు

కోడుమూరు: కోడుమూరులో పునర్ నిర్మిస్తున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శ్రీ శివ శక్తి వినాయక బృందం సభ్యులు రూ.25,116లను ఆలయ చైర్మన్, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో.. పంచాయతన దేవతల శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయాన్ని సిమెంట్, ఇసుక ఉపయోగించకుండా వందల సంవత్సరాలు ఉండేవిధంగా పూర్తిగా పురాతన పద్ధతిలో రాతిదూలాలు, స్తంభాలు, శిల్పాలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి నేత్రదానం



మద్దిలేటి రెడ్డి నేత్రాలను ఐ బ్యాంక్ సిబ్బందికి అప్పగిస్తున్న కుమారుడు జయచంద్రారెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో రాజకీయ కురువృద్ధుడిగా పేరొందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మల్లు మద్దిలేటిరెడ్డి (80) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. మద్దిలేటి రెడ్డి మరణించాక తన కళ్లు మరొకరికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో గతంలోనే శ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఐబ్యాంక్‌కు డొనేట్ చేశారు. బుధవారం ఆయన మరణించడంతో విషయం తెలుసుకున్న డాక్టర్లు కుటుంబసభ్యులను సంప్రదించి వారి అనుమతితో నేత్రాలను తీసుకెళ్లారు. నేత్రాలు దానం చేయడం ద్వారా మద్దిలేటి రెడ్డి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న సెబ్, ఇంటెలిజెన్స్ అధికారులు

పాణ్యం: మండలంలోని నాటుసారా స్థావరాలపై సెబ్, ఇంటెలిజెన్స్ అధికారులు బుధవారం విస్తృత దాడులు చేశారు. జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్, సెబ్ అధికారులు లక్ష్మణ్‌దాస్ సూచనలతో ఈ దాడులు చేపట్టారు. గోరుకల్లు తాండా సమీపంలో సారా బట్టీలు నిర్వహిస్తున్నారనే విషయం తెలుసుకోని అక్కడికి వెళ్లి దాడులు చేసి 3 బట్టీలను ధ్వంసం చేసినట్లు అధికారులు చెప్పారు. సారా తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ డ్రమ్ములను కాల్చివేశారు. అలాగే 5700 బెల్లంలీటర్ల ఊటను పారబోశామన్నారు. బట్టీల నిర్వాహకులు పరారీలో ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే వారిని అరెస్టు చేస్తామన్నారు. దాడుల్లో ప్రవీణ్‌కుమార్, శ్రీలక్ష్మీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ శాఖ సమీక్ష

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ టౌన్, రూరల్స్ డివిజన్ల సమీక్ష సమావేశం గురువారం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు సంస్థ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు బుధవారం సాయంత్రం కర్నూలుకు చేరుకున్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లోని సమావేశ హాలులో రెండు డివిజన్ల ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, జూనియర్ ఇంజినీర్లు, అకౌంట్స్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు



నన్నూరులో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు



గూడూరులో గణేశుని శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



కోడుమూరులో వినాయక విగ్రహాన్ని బావిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



కోడుమూరులో నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయక విగ్రహాలు



చిన్నటేకూరులో గణేశ్ శోభాయాత్రలో చిన్నారుల సందడి



సి.బెళగల్‌లో నిమజ్జనానికి బయలుదేరిన భారీ గణనాథుడు

కోడుమూరు రూరల్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కోడుమూరులో వాడవాడలా కొలువుదీరిన గణపతులను బుధవారం సాయంత్రం పట్టణంలోని వెంకటగిరి రోడ్డువైపున్న బావిలో నిమజ్జనం చేశారు. ముందుగా వినాయక విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాలపై ఉంచి మేళతాళాల మధ్య మెయిన్‌బజార్ గుండా ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి వరకు నిమజ్జనం కొనసాగింది. భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు సంధ్యావిక్రమ్‌కుమార్, నిమజ్జన కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, నాగేశ్వరరావు, కిరణ్, శ్రీనివాసులు, రవి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాల నిమజ్జనాన్ని ప్రారంభించారు. కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

సి.బెళగల్: గత మూడు రోజులుగా గ్రామాలలో పూజలందుకున్న గణనాథులను భక్తులు ఘనంగా నిమజ్జనం చేశారు. ఉదయం నుంచే వినాయక మండపాల వద్ద కోలాహలం నెలకొంది. మధ్యాహ్నం నుంచే యువత కేరింతలు కొడుతూ విగ్రహాల దగ్గర ఏర్పాటు చేసిన నీటి ఉట్లను పగుల కొట్టారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు వినాయకుడి చేతిలోని లడ్డూలు, పూజ టెంకాయలు, చెరకు గడల వేలం నిర్వహించారు. భక్తులు పోటీపడి అధిక ధరకు వాటిని సొంతం చేసుకున్నారు. దాదాపు ప్రతి విగ్రహం వద్ద రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు లడ్డు ధర పలికింది. కొన్ని మండపాల వద్ద జరిగిన పూజా వస్తువుల వేలం పాటలో ముస్లింలు పాల్గొని మత సామరస్యాన్ని చాటారు

ఓర్వకల్లు: మండలంలో కొలుదీరిన ఘనేష్ విగ్రహాలకు బుధవారం నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, మీదివేముల, ఉప్పలపాడు గ్రామాలలో గత మూడు రోజులుగా పూజలు అందుకున్న గణనాధులను ఊరేగింపుతో తీసుకెళ్లి సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కళాకారుల డప్పు మోతలు, భాజాభజంత్రీలతో గ్రామాలు మారుమోగాయి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

గడివేముల: జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై..అంటూ గ్రామాల్లో కొలువైన గణనాథులను గురువారం నిమజ్జనానికి తరలించారు. గడివేముల మండలంలో మొత్తం 46 విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. గడివేముల మినహా అన్ని గ్రామాల్లో చిన్నా, పెద్దా, మహిళలు అనే తేడా లేకుండా భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకల్లో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. పాణ్యం సీఐ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య సిబ్బందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కల్లూరు: మండలంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజలందుకున్న లంబోధరుడు బుధవారం సాయంత్రం నిమజ్జనానికి తరలివెళ్లాడు. వినాయక మండపాల దగ్గర మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉలిందకొండ గ్రామంలో విగ్రహాలను చెరువులో, బస్తిపాడు విగ్రహాలు హంద్రీ నది, చిన్నటేకూరు గ్రామ విగ్రహాలు హంద్రీ-నీవా కాలువలో నిమజ్జనం చేశారు.

ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులు



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- 20వ వార్డులో రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కల్లూరు: నగరంలోని అన్ని వార్డులో ప్రాధాన్యతలను అనుసరించి శివారు కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులోని అరుంధతీ నగర్, బద్రీనాథ్ కాలనీల్లో రూ.70 లక్షలతో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి, ధన లక్ష్మి నగర్‌లో రూ.40 లక్షలతో పార్కు అభివృద్ధి పనులకు మేయర్, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి పనుల్లోనూ దూసుకుపోతుందన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనాన్ని దోచుకున్న వారందరికీ చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందేమోననే అనే భయం నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కల్లూరు అర్బన్ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

నగరంలోని అన్ని వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా కమీషన్ల కోసం నాసిరకంగా పనులు చేయడం లేదన్నారు. కర్నూలు నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, అరుణ, లక్ష్మికాంతరెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఎస్‌ఈ పి.వి.శేషసాయి, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమ శంకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, యూనూస్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన రహదారి కల

- రూ.5 కోట్లతో ఉల్చాల – రేమట రోడ్డు నిర్మాణం
- భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే సుధాకర్



ఉల్చాల - రేమట రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఉల్చాల నుంచి రేమట మీదుగా కొత్తకోట గ్రామం వరకు రూ.5 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించినట్లు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ స్పష్టం చేశారు. బుధవారం భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, రేమట మూలరామేశ్వర స్వామి దేవస్థానం చైర్‌పర్సన్ సరళారెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేమట మీదుగా కొత్తకోట, కానాపురం రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అంబులెన్స్ రాకపోవడం, బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారని అన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, కరోనా విపత్తుకు ముందే రోడ్డు నిర్మాణ పనులు మొదలై ఆ తర్వాత అనివార్య కారణాలతో నిలిచిపోయాయని అన్నారు. ఆ తర్వాత కాంట్రాక్టర్లతో మాట్లాడామని ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 కోట్ల నిధులతో ఉల్చాల నుంచి రేమట వరకు, రేమట నుంచి కొత్తకోట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. 70 ఏళ్ల నుంచి సరైన రోడ్లు లేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. నియోజకవర్గంలో రూ.300 కోట్ల నిధులతో ప్రతి గ్రామంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశామన్నారు. సుంకేసుల నుంచి తిమ్మందొడ్డి, పూడూరు, గూడూరు – కోడుమూరు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, ఈఈ సురేషబాబు, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ-2 నెహెమ్యా, జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, సర్పంచ్ విద్యాసాగర్, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కోడుమూరు రూరల్: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలపై మండల స్పెషలాఫీసర్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మిదేవి అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరై నిర్మాణాలు మొదలుపెట్టని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జేడీ ఆదేశించారు. గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

22న కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్: ఈనెల 22వ తేదీ శుక్రవారం కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సృజన అధ్యక్షతన స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు మండల మీట్

గూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం వైకేపీ సమావేశ హాలులో నిర్వహించనున్నట్లు కార్యాలయ ఏఓ విజయసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ సునీతమ్మ అధ్యక్షత వహిస్తారని, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

స్థల వివాదంలో నలుగురిపై కేసు

కర్నూలు: నగర శివారులోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఉన్న దివ్య బార్ అండ్ రెస్టారెంట్‌ను జేసీబీతో కూల్చివేశారని శివలింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. నర్సింహులు, డేవిడ్, శంకర్ గౌడ్, కుప్పాటి రాజశేఖర్‌లతో శివలింగారెడ్డికి స్థల విషయంలో వివాదం ఉంది. దీనిపై కోర్టుకు వెళ్లగా శివలింగారెడ్డికి అనుకూలంగా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. దీంతో పై నలుగురు కలసి మంగళవారం రాత్రి దివ్య బార్ గోడను కూల్చివేయడంతో శివలింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు మూడవ పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా పీజీ పరీక్షలు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. 40 మందికి గానూ 38 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, ఇద్దరు మాత్రమే గైర్హాజరయ్యారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఎండుతున్న మొక్కలు



ఈర్లదిన్నె గ్రామ సచివాలయ ఆవరణలో ఎండుతున్న మొక్కలు

సి.బెళగల్: అధికార యంత్రంగం తమకు పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పచ్చని నీడను ఇవ్వాల్సిన మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, నూతన సచివాలయ భవన ఆవరణలో మొక్కలు నాటాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు, సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె గ్రామ సచివాలయానికి దాదాపు వంద మొక్కలను అధికారులు తెప్పించారు. అయితే పాదులు తీసి నాటాల్సిన మొక్కలపై మండల అధికారుల పర్యవేక్షణ లోపం, ఉపాధిహామీ, పంచాయతీ రాజ్ శాఖల మధ్య సమన్వయలోపంతో దాదాపు 70కి పైగా మొక్కలను నాటకుండా సచివాలయ ఆవరణలోనే వదిలేశారు. అక్కడున్న మొక్కలకు కనీసం నీరు కూడా పోయకపోవడంతో కొన్ని మొక్కలు ఎండిపోయాయి. సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు సైతం పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండుతున్నాయని ఇప్పటికైనా అధికార యంత్రాంగం మొక్కలకు నీళ్లు పోసి, ఖాళీ స్థలాల్లో నాటే ప్రయత్నం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లు సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో పండ్ల తోటలు సాగు చేసుకున్న రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఓ కుమార్ సాయినాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పీడీతో పాటు, పీఓ (ఎంపీడీఓ) శివనాగప్రసాద్, పండ్ల తోటల పెంపకం డివిజనల్ అధికారి అనూష ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండ్ల తోటల సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఐదెకరాలలోపు భూమి కలిగిన రైతుల ఆసక్తి మేరకు జాతీయ ఉపాధి పథకం ద్వారా పండ్ల మొక్కలను ఉచితంగా మంజూరు చేయడమేగాక, మూడేళ్ల పాటు వాటి నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఇందులో భాగంగా మామిడి, చీని, జామ, దానిమ్మ, కొబ్బరి, నిమ్మ, సపోట వంటి మొక్కలను అందిస్తారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసీ మధువెంకటకృష్ణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సూర్య నారాయణరెడ్డి పాల్గొన్నారు

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయండి



చింతమానుపల్లెలో ఉద్యోగులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఓఆర్డీ సందీప్‌తో కలిసి డీడీ మండలంలోని పలుకుదొడ్డి, సంగాల, చింతమానుపల్లె గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని ప్రాధాన్యత భవన నిర్మాణాలను పరిశీలించి, నిర్మాణాలు నాణ్యతగా, త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులు, ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆదేశించారు. అదేవిధంగా సంగాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం అధ్వానంగా ఉండటంపై నిర్వాహకులపై మండిపడ్డారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై పలు సూచనలు చేసి, పద్ధతి మార్చుకోవాలని నిర్వాహకులను హెచ్చరించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలను, వైద్య సబ్ సెంటర్లను తనిఖీ చేసి, లబ్ధిదారులకు అందుకుతున్న సేవలు, నిర్వహణ తీరును పరిశీలించి సూచనలు చేశారు. సంగాల గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి, ఉద్యోగుల హాజరు, విధుల నిర్వహణ, స్పందన సమస్యలు తదితర అంశాలపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించి, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగునంగా పనిచేయాలని సూచించారు. సంగాల సర్పంచ్ హనుమంతు, పంచాయతీ కార్యదర్శి ముస్తక్‌బాష తదితరులు ఉన్నారు.

పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు



ఈర్లదిన్నెలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె గ్రామాలలో పర్యటించి ఆర్బీకేలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి గ్రామాలలో పర్యటించి, రైతులు సాగు చేసిన వరి, పత్తి, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. పంట నమోదుతో బీమాతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు అవుతారని, ఆర్బీకేల ద్వారా అందే పరిహారం, సబ్సిడీ, ధాన్యం అమ్మకాలు, విత్తన కొనుగోలు, బ్యాంకులలో రుణాలు, ప్రభుత్వ సహాయ సహకారాలకు పంట నమోదు అవసరమవుతుందని అవగాహన కల్పించారు. రైతులు గ్రామాలలోని వ్యవసాయ సహాయకులు, సిబ్బందిని కలిసి పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. వీఆర్వో శ్రీనివాసులు, వ్యవసాయ సహాయకులు షరీఫ్, చంద్రశేఖర్, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, వీఆర్ఏలు, రైతులు ఉన్నారు.

గడివేముల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు, సంబంధిత రైతులతో ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఏఓ హమసుందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని బొల్లవరం, గడిగరేవుల గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. కేవలం పంట నమోదు చేసుకుని ఈ-కేవైసీ చేయించుకోకపోతే రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు రావన్నారు ప్రతి రైతు స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం గడివేములలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అనధికార పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈఓ వెంకటేష్ వెంట ఉన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



ప్యాలకుర్తి గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: మండలంలోని గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న మొబైల్ ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం 4 రోజుల పాటు మొబైల్ ఆధార్ క్యాంపులను గ్రామ సచివాలయాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. క్యాంపుల్లో ప్రజలంతా తమ ఆధార్‌కు మొబైల్ నెంబర్ అనుసంధానంతో పాటు, ఐదేళ్లలోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు వంటి సేవలను పొందాలని సూచించారు. ఆధార్ నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా



జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజారోగ్యానికి భరోసా ఏర్పడుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని తారకరామనగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓలు ఇంటింటికి వచ్చి వ్యాధుల వివరాలు నమోదు చేసుకుని టోకెన్లు అందజేస్తారన్నారు. టోకెన్లు అందుకున్న వారు నిర్ణీత తేదిల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలకు హాజరుకావాలన్నారు. వారికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఫలితాలను జేఏఎస్ యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. వీటి ఆధారంగా స్పెషలిస్టు వైద్యులు చికిత్స, మందులు అందజేస్తారన్నారు. జిల్లా మాస్ మీడియా అధికారిణి ప్రమీలమ్మ స్థానిక ముజఫర్‌నగర్ యుపీహెచ్‌సీని సందర్శించి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.